క్లుప్తంగా

జంట పాముల కలకలం



రక్త పింజరి పామును బంధిస్తున్న గణేష్‌వర్మ

ముమ్మిడివరం: మల్లాయపాలెంలో ఓ రైతు పొలంలో రెండు రక్త పింజరి పాములు కలకలం సృష్టించాయి. గ్రామానికి చెందిన రెడ్డి వెంకటేశ్వరరావు పొలంలో పనులు చేసుకుంటుండగా ఒక్కసారిగా రెండు రక్త పింజరి పాములు కంట పడి హడలెత్తించాయి. దీంతో ఆయన బీమనపల్లికి చెందిన స్నేక్ క్యాచర్ గణేష్ వర్మకు సమాచారం ఇవ్వడంతో అక్కడికి చేరుకొని పాములను చాకచక్యంగా పట్టుకున్నాడు. ఈ పాములు ఏజెన్సీ ప్రాంతానికి చెందినవని వరదలకు ఈ ప్రాంతానికి వస్తున్నాయని గణేష్‌వర్మ తెలిపారు.

వచ్చే నెల 30న సూర్యారాధన మహోత్సవాలు



ఇందుపల్లిలో రాట ముహూర్తం చేస్తున్న గోపాలకృష్ణ తదితరులు

అమలాపురం రూరల్: అమలాపురం మండలం ఇందుపల్లి గ్రామంలో దశమ వార్షిక మాస దీక్ష సూర్యారాధనను జనవరి 30వ తేదీ నుంచి ప్రారంభిస్తునట్లు నిర్వాహకులు గొర్తి గోపాలకృష్ణ చెప్పారు. జనవరి 30వ తేదీన ప్రారంభమై మార్చి రెండో తేదీన పూర్ణాహుతి కార్యక్రమంతో సూర్యారాధన పూర్తవుతుందని తెలిపారు. దశమ వార్షికం సందర్భంగా పెద్ద ఎత్తున పూజా కార్యక్రమాలతో పాటు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు చెప్పారు. కార్యక్రమానికి సంబంధించి ఆదివారం రాట ముహూర్తం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గొర్తి వెంకటేశ్వర శర్మ, శిష్ట సత్యనారాయణ మూర్తి, తాతా కాశీ విశ్వనాథ్ తదితరులు పాల్గొన్నారు.

సౌత్ జోన్ స్విమ్మింగ్ పోటీలకు ఎంపిక

యానాం: విజయవాడలో ఈ నెల 27 నుంచి 29 వరకు నిర్వహించే 35వ సౌత్‌జోన్ ఆక్వాటిక్ చాంపియన్‌షిప్ పోటీలకు యానాం స్పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా(సాయ్) స్విమ్మింగ్ శిక్షణా క్రీడాకారులు 14 మంది ఎంపికయ్యారని సెంటర్ ఇన్‌చార్జి ఎస్ ఉదయకుమార్ తెలిపారు. ఈ సందర్భంగా పురుషుల విభాగంలో కొల్లాటి సతీష్, ఓంకార్, నిషాంత్, వరుణ్‌సస్తా, జీకేఎస్ వరుణ్, అభిశక్త్, నాగసాయ్, మణికంఠ నవీన్, హర్షలు ఎంపిక కాగా మహిళా విభాగం నుంచి నమ్రత, వల్లిక, శరణ్య, ప్రవల్లిక, ముకుందశ్రీ ఎంపికయ్యారని చెప్పారు. వీరందరికీ కోచ్ గ్రంధి రవితేజ నేతృత్వం వహిస్తారని తెలిపారు.

కుల ధ్రువీకరణ పత్రాలు మంజూరు చేయాలి

అమలాపురం టౌన్: వెంకటాయపాలెం శిరోముండనం బాధితులు కోటి చినరాజు, దడాల వెంకటరత్నం పిల్లలకు కుల ధ్రువీకరణ పత్రాలు తక్షణమే మంజూరు చేయాలని మానవ హక్కుల వేదిక ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మహమ్మద్ ఇక్బాల్, నామాడి శ్రీధర్‌లు డిమాండ్ చేశారు. బాధితుల పిల్లలకు కుల ధ్రువీకరణ పత్రాలు మంజూరు చేయడంలో రెవెన్యూ అధికారులు తాత్సారం చేస్తున్నారని ఆరోపించారు. బాధితులను కోర్టు ఎస్సీలుగా గుర్తించిన క్రమంలో వారి పిల్లలకు తక్షణమే కుల ధ్రువీకరణ పత్రాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

'అవిశ్వాసం పెట్టే ధైర్యముందా'

యానాం: పుదుచ్చేరిలో ఎన్ఆర్ కాంగ్రెస్, బీజేపీ ఆధ్వర్యంలోని ఎన్డీయే కూటమి ప్రభుత్వం మెజారిటీ కోల్పోయిందని వ్యాఖ్యానిస్తున్న కాంగ్రెస్ పార్టీకి ప్రభుత్వంపై అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టే ధైర్యముందా అని ఆదివారం పలువురు బీజేపీ ఎమ్మెల్యేలు ప్రశ్నించారు. ఆదివారం పుదుచ్చేరి లెఫ్టినెంట్ గవర్నర్ కె కైలాష్‌నాథన్‌ను రాజ్‌నివాస్‌లో బీజేపీ ఎమ్మెల్యేలు జాన్‌కుమార్, కల్యాణ సుందరం, వివియస్ రిచర్డ్, ప్రభుత్వానికి మద్దతిస్తున్న స్వతంత్ర ఎమ్మెల్యే ఎం శివశంకరన్ తదితరులు కలిశారు. అనంతరం వారు విలేకరులతో మాట్లాడారు. పుదుచ్చేరి అసెంబ్లీ స్పీకర్ కార్యకలాపాల గురించి శాసనసభలో తెలియజేస్తామని, కాంగ్రెస్ హయాంలో సంక్షేమాన్ని మరిచి పోయారని విమర్శించారు. స్పీకర్ సెల్వంపై అవిశ్వాసం పెట్టాలని ఎమ్మెల్యేలు నెహ్రు, అంగళన్ నోటీసులు ఇచ్చిన నేపథ్యంలో స్పీకర్ సెల్వం వివరణ ఇచ్చారు. తాను ప్రభుత్వ కార్యక్రమాలు, పార్టీ కార్యక్రమాల్లో పాల్గొనేటప్పుడు నిబంధనలు ఎక్కడా ఉల్లంఘించలేదని తెలిపారు. ఎల్జీ కె కైలాష్‌నాథన్‌తో అనూహ్య రీతితో సమావేశయ్యారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ ఎల్జీ ఆదేశాల మేరకు తాను స్పీకర్, సీఎం ప్రభుత్వ కార్యక్రమాల్లో పాల్గొంటానని వెల్లడించారు.

ఇళ్లు నిర్మించారు.. వసతులు మరిచారు..!

- సమస్యల వలయంలో టిడ్కో నివాస సముదాయాలు
- కనీస సౌకర్యాలు కరవు
- ట్యాంకర్లతో అరకొర తాగునీటి సరఫరా
- డ్రెయిన్లు లేక ముంపునకు గురవుతున్న నివాస ప్రాంతాలు
- కార్యరూపం దాల్చని హామీలు
- రూ.2 కోట్లు వెచ్చిస్తేనే సమస్యల పరిష్కారం



బోడసకుర్రు టిడ్కో అపార్ట్‌మెంట్ల సముదాయం



అండర్ గ్రౌండ్ డ్రైనేజీ లేక ముంపు నీటిలో టిడ్కో అపార్ట్‌మెంట్లు (ఫైల్)

అమలాపురం టౌన్: అమలాపురం పట్టణంలో ఇళ్లు లేని లబ్ధిదారులకు దాదాపు అయిదు కిలోమీటర్ల దూరంలో అల్లవరం మండలం బోడసకుర్రులో నిర్మించిన టిడ్కో ఇళ్ల సముదాయాలు సమస్యల వలయంలో కొట్టుమిట్టాడుతున్నాయి. కనీస సౌకర్యాలకు నోచుకోని ఈ ఇళ్ల సముదాయంలో ఉండలేక లబ్ధిదారులు వేరే ప్రాంతాలకు వెళ్లిపోతున్నారు. 2018లో అప్పటి టీడీపీ ప్రభుత్వ హయాంలో టిడ్కో ఇళ్ల నిర్మాణం చేపట్టారు. 52 అపార్ట్‌మెంట్లలో కొన్నింటిలో అప్పుడే నాణ్యతా లోపాలు బయట పడుతున్నాయి. కొన్ని ప్లాట్లలో వర్షం నీరు లీకేజీ కావడంతో లబ్ధిదారులు అవస్థలు పడుతున్నారు. తాగునీరు అరకొరగా అందుతోంది. కనీసం వాడకం నీరు కూడా లేక జీవనం అస్తవ్యస్తంగా మారింది. అండర్ గ్రౌండ్ డ్రెయిన్లు లేక వర్షం వస్తే ముంపు నీటిలోనే భవనాలు రోజుల పాటు ఉండిపోతున్నాయి.

గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం టిడ్కో ఇళ్ల సముదాయాన్ని టౌన్‌షిప్‌గా చేయాలని ప్రతిపాదించింది. రూ.1.50 కోట్లతో అండర్ గ్రౌండ్ డ్రెయిన్లు నిర్మించేందుకు నిధుల మంజూరుకు ప్రయత్నించింది. ఇంతలో ప్రభుత్వం మారడంతో ఎక్కడి గొంగళి అక్కడే అన్న చందంగా మారింది. ప్రధాన సమస్యగా పరిణమిస్తున్న అండర్ గ్రౌండ్ డ్రైనేజీ సమస్య మరుగున పడింది. డ్రెయిన్ల సౌకర్యం లేక వర్షం వచ్చినప్పుడల్లా ముంపునీరు అపార్ట్‌మెంట్ల చుట్టూ నిలిచిపోతోంది. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు 52 అపార్ట్‌మెంట్లను ముంపు నీరు ముంచెత్తింది.

వాడకాలకు సైతం నీరులేని దైన్యం

టిడ్కో పర్యవేక్షణ అంతా అమలాపురం మున్సిపాలిటీయే నిర్వహిస్తోంది. ఇక్కడ తాగునీటి సౌకర్యం లేక మున్సిపాలిటీయే వారానికి నాలుగైదు ట్యాంకర్ల ద్వారా తాగునీరు పంపిస్తోంది. ప్రస్తుతం ప్లాట్లతో దాదాపు 550 కుటుంబాలు జీవిస్తున్నాయి. మొదట్లో 650కి పైగా కుటుంబాలు నివసించేవి. సౌకర్యాల లేమితో కొందరు లబ్ధిదారులు ప్లాట్లను విడవడంతో ఇప్పుడు లబ్ధిదారులు సంఖ్య క్రమేపీ తగ్గుతోంది. అరకొర తాగునీటి సరఫరాతో తమ గొంతులు తడవడం లేదని లబ్ధిదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తమ దాహార్తిని తీర్చేలా మున్సిపాలిటీ తాగునీటి ట్యాంకర్లు పంపించాలని కోరుతున్నారు. ఇక బోర్ వాటర్ విధానమే ఇక్కడ లేదు. తాగునీరు దేవుడెరుగు.. కనీసం ఇంట్లో వాడకాలకు సైతం నీరు లేక అవస్థలు పడుతున్నామని లబ్ధిదారులు ఆందోళన వ్యక్తం చేశారు. వాహనాలు పెట్టుకునేందుకు షెడ్లు, శ్మశాన వాటికలు తదితర సౌకర్యాలు లేవు. ఈ సమస్యలన్నీ శాశ్వతంగా పరిష్కారం కావాలంటే కనీసం రూ.2 కోట్ల నిధుల మంజూరు చేస్తే లబ్ధిదారులు ఆ ప్లాట్లలో కొనసాగే పరిస్థితి ఉంటుంది. లేకపోతే ఒక్కొక్కరుగా అసౌకర్యాలు, సమస్యలకు భయపడి ప్లాట్లను ఖాళీ చేసి వెళ్లిపోవడం ఖాయం.

హామీల అమలు ఎప్పుడో!

రెండు నెలల కిందట టిడ్కో అపార్ట్‌మెంట్లను స్థానిక ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు సందర్శించి లబ్ధిదారులు చెప్పిన సమస్యలను విన్నారు. సమస్యలు పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. వారం కిందట రాష్ట్ర టిడ్కో చైర్మన్ అజయ్ కుమార్ ఇక్కడి టిడ్కో అపార్ట్‌మెంట్లను సందర్శించారు. లబ్ధిదారులు తమ సమస్యలను ఆయనకు ఏకరువు పెట్టారు. వినతి పత్రం అందించారు. ఆయన హామీలు ఇచ్చారు. ఈ హామీలు కార్యరూపం దాల్చే పరిస్థితి కనిపించడం లేదని లబ్ధిదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

విన్నవించినా ఫలితం లేదు



టిడ్కో అపార్ట్‌మెంట్లలో అనేక సమస్యలు తిష్ట వేశాయి. తాగునీరు, లీకేజీలు, వాడకం నీరు, డ్రైనేజీ వంటి సమస్యలతో ఇబ్బంది పడుతున్నాం. వర్షం వస్తే అండర్ గ్రౌండ్ డ్రైనేజీ లేక ఇక్కడ నివాసితులు పడుతున్న పాట్లు దేవుడికే తెలుసు. చాలీ చాలని తాగునీటితో బతుకుతున్నాం. ఇటీవల వచ్చిన రాష్ట్ర టిడ్కో చైర్మన్‌కు సమస్యలపై వినతి పత్రం ఇచ్చాం.

ఉప్పాడ నూకరత్నం, టిడ్కో ఇంటి గృహిణి, బోడసకుర్రు.

దశల వారీగా పరిష్కారం

బోడసకుర్రు టిడ్కో అపార్ట్‌మెంట్ల వద్ద నెలకొన్న కొన్ని సమస్యలను దశల వారీగా పరిష్కరిస్తాం. ఈ నెల 27న జరిగే మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో ఆమోదం తీసుకొని టిడ్కో అపార్ట్‌మెంట్ల వద్ద నీటి అవసరాలకు ఓ బోరు తవ్విస్తాం. తాగునీటిని ట్యాంకర్ల ద్వారా అమలాపురం నుంచి పంపిస్తున్నాం. అండర్ గ్రౌండ్ డ్రైనేజీ ఏర్పాటుకు ప్రభుత్వం నుంచి గ్రాంటు రావాల్సి ఉంది.

కేవీఆర్ఆర్ రాజు, కమిషనర్, అమలాపురం మున్సిపాలిటీ.

ఆలోచింపజేస్తున్న 'హెల్మెట్' సందేశం

అమలాపురం పోలీసుల వినూత్న ప్రయత్నం



హెల్మెట్ ధరించాలని తన తండ్రికి ఓ చిన్నారి చెబుతున్న సందేశాత్మక బోర్డు

అమలాపురం టౌన్: 'పది నిమిషాలు ఆలస్యమైనా పర్వాలేదు.. నెమ్మదిగా రా నాన్నా' అంటూ ఓ చిన్నారి తన తండ్రికి మోటారు సైకిల్‌పై వస్తున్నప్పుడు హెల్మెట్ ధరించడం మరవొద్దని చెప్పే మాటలను అమలాపురం పోలీసులు ఫ్లెక్సీల రూపంలో ప్రదర్శిస్తున్నారు. ఈ వినూత్న ప్రయోగం పలువురిని ఆలోచింపజేస్తోంది. ద్విచక్ర వాహనాన్ని నడిపే సమయంలో హెల్మెట్ ధరించాలని చిన్నారి తన తండ్రికి చెబుతున్న మాటలతో కూడిన ఫ్లెక్సీలు ఆకట్టుకుంటున్నాయి. ఇటీవల ఉన్నత న్యాయస్థానం సైతం విధిగా ద్విచక్ర వాహన చోదకులు హెల్మెట్ ధరించాలని ఆంక్షలు విధించిన నేపథ్యంలో అమలాపురం పోలీసులు ఈ వినూత్న ప్రయత్నానికి శ్రీకారం చుట్టారు. పట్టణంలో ట్రాఫిక్ ఎక్కువగా ఉండే రోడ్ల చెంత పోలీసులు ఏర్పాటు చేసిన ఈ సందేశం బోర్డులను వాహన చోదకులు ఆసక్తిగా పరికిస్తున్నారు. దీంతో వారిలో హెల్మెట్ ధరించాలన్న ఓ కొత్త ఆలోచన ఆవిష్కృతమవుతోంది. కుటుంబ భద్రతను దృష్టిలో ఉంచుకొని హెల్మెట్ ధరించి వాహన చోదకులు ప్రయాణాలు చేయాలని అమలాపురం పట్టణ సీఐ పి.వీరబాబు విజ్ఞప్తి చేస్తున్నారు. ఇక ముందు కరపత్రాలు ముద్రించి వాహనచోదకులకు అందించనున్నట్లు చెప్పారు.

పోరాట యోధుడు పీవీ రావు చిరస్మరణీయుడు



అమలాపురంలో పీవీ రావు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు



చల్లపల్లిలో పీవీ రావు విగ్రహానికి నివాళులర్పిస్తున్న దళిత నాయకులు

అమలాపురం టౌన్: మాల మహానాడు వ్యవస్థాపకుడు దివంగత పీవీ రావు వర్ధంతి కార్యక్రమాన్ని స్థానిక గడియారం స్తంభం సెంటరులో జిల్లా మాల మహానాడు ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా జరిగింది. తొలుత పీవీ రావు చిత్రపటానికి జిల్లా మాల మహానాడు నాయకులు పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఎస్సీ వర్గీకరణను వ్యతిరేకిస్తూ దివంగత పీవీ రావు ఎన్నో ఉద్యమాలు, పోరాటాలు చేశారని, చివరకు ఆ పోరాటంలోనే ఆయన ప్రాణాలు వదిలారని మాల మహానాడు నాయకులు పెయ్యల శ్రీనివాసరావు, నాతి శ్రీనివాసరావు, పెయ్యల పరశురాముడు తదితరులు తమ తమ ప్రసంగాల్లో పేర్కొన్నారు.

అమిత్‌షా వ్యాఖ్యలకు నిరసన

కేంద్ర మంత్రి అమిత్‌షా రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌పై చేసిన అనుచిత వ్యాఖ్యలను వ్యతిరేకిస్తూ జిల్లా మాల మహానాడు నాయకులు నిరసన ప్రదర్శన చేపట్టారు. 'అమిత్‌షా కో హటావో... సంవిధాన్ బచావో' అంటూ నినాదాలు చేశారు. అమిత్‌షాను కేంద్ర మంత్రి వర్గం నుంచి బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ నిరసన ప్రదర్శనలో మాల మహానాడు జిల్లా నాయకులు పోతుల నాగరాజు, సరెళ్ల రామకృష్ణ, కాశి వెంకటరావు, వడ్డి గంగ, పరమట రాంప్రసాద్, పెనుమాల చిట్టిబాబు, సాపే బాలరవి, మట్టా వెంకట్రావు, గన్నవరపు శ్రీను తదితరులు పాల్గొన్నారు.

పోరాట యోధుడు పీవీ రావు

ఉప్పలగుప్తం: మాలల హక్కుల కోసం తనదైన శైలిలో పోరాటాలు చేసిన పోరాట యోధుడు పీవీరావు అని మండల మహానాడు నాయకులు అన్నారు. మాల మహానాడు ఉద్యమ వ్యవస్థాపకుడు పీవీరావు 19 వర్ధంతిని మండలంలోని ఎస్.కొత్తపల్లి, చల్లపల్లి గ్రామాల్లో ఆయన అభిమానులు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మండల మాల మహానాడు అధ్యక్షుడు కొంకి వెంకట బాబ్జి, దళిత ఐక్య వేదిక కన్వీనర్ జంగా బాబురావు, ప్రధాన కార్యదర్శి ఇసుకపట్ల రఘుబాబు, కుంచే చిన్ని, కాట్రు ఆనందరావు, బూసి బుజ్జిదొర, కొంకి గంగాధర్‌రావు, యలమంచిలి విజయ్‌కుమార్, కొంకి రాజారావు, గోసంగి శ్రీనివాసరావు, కొంకి బాలకృష్ణ, నందిక రమేష్, కొంకి బాబురావు, దాసరి మాణిక్యాలరావు, కొంకి భగవాన్‌దాస్ తదితరులు పాల్గొన్నారు.

ఐ.పోలవరం: దళితుల ఐక్యతే ధ్యేయంగా పీవీరావు కృషి చేశారని, మాలల హక్కుల కోసం ఎనలేని పోరాటాలు చేశారని మాల మహానాడు నాయకులు ప్రస్తావించారు. మాల మహానాడు వ్యవస్థాపక అధ్యక్షుడు పీవీరావు 19వ వర్ధంతి సందర్భంగా మండలంలోని పాత ఇంజరం ప్రాంతంలో ఉన్న అంబేడ్కర్ విగ్రహం వద్ద జిల్లా కార్యదర్శి రేవు శ్రీను అధ్యక్షతన దళిత నాయకులు ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో వడ్డి గౌతమ్, మట్టా గగనవీరుడు, దుక్కపాటి సత్యనారాయణ, బీర సత్యనారాయణ, బొంతు శ్రీరాములు, నల్ల రాజు, పండు విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ముమ్మిడివరం: ముమ్మిడివరం నగర పంచాయతీ పోలమ్మ చెరువు వద్దగల జై బుద్ధపార్కులో ఆదివారం మాల మహానాడు వ్యవస్థాపక అధ్యక్షుడు స్వర్గీయ పీవీరావు వర్ధంతిని నిర్వహించారు. తొలుత అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం స్వర్గీయ పీవీ రావుకు నివాళులర్పించారు. అంబేడ్కర్ వాదిగా పీవీరావు అనేక ఉద్యమాలు చేశారని ఆయన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో వడ్డి నాగేశ్వరరావు, కాశి బాబు జగజ్జీవన్‌రావు, ఎం.ఆశీర్వాదం, ఎస్.అబ్బులు, కాశి సింహాద్రివర్మ, సబ్బతి సత్యనారాయణ, యలమంచిలి బాలరాజు, జనిపెల్ల జనార్దనరావు తదితరులు పాల్గొన్నారు.

ముమ్మిడివరం: మాలమహానాడు వ్యవస్థాపక అధ్యక్షుడు స్వర్గీయ పీవీరావు వర్ధంతిని మాల మహానాడు జేఏసీ, ఉద్యోగ సంఘాల ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. పోలమ్మ చెరువు వద్ద గల అంబేడ్కర్ విగ్రహంతో పాటు పీవీరావు చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. చీకురుమిల్లి శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో పలువురు వక్తలు మాట్లాడారు. కార్యక్రమంలో ఉద్యోగ సంఘాల నాయకులు ఎం.ఆశీర్వాదం, జనిపెల్ల సత్యనారాయణ, కాశి జగపతిరావు, కాశి జగజ్జీవన్‌రావు, మట్టా శ్రీను, కాశి వెంకటాచారి, దాసరి వెంకటరమణ పాల్గొన్నారు.

హైందవ శంఖారావం పోస్టర్ల విడుదల



హైందవ శంఖారావం పోస్టర్లు విడుదల చేస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ సత్య నాగేంద్రమణి, వైస్ చైర్మన్ నానిరాజు, కౌన్సిలర్లు

అమలాపురం టౌన్: వచ్చే నెల 5వ తేదీన విజయవాడలో జరగనున్న హైందవ శంఖారావం మహాసభను విజయవంతం చేయాలని కోరుతూ స్థానిక భూపయ్య అగ్రహారంలో హిందువుల ఇళ్లకు శంఖారావం స్టిక్కర్లు అతికించారు. స్థానిక మున్సిపల్ వైస్ చైర్మన్ రుద్రరాజు నానిరాజు ఇంటి వద్ద శంఖారావం బ్రోచర్ల విడుదల కార్యక్రమం ఆదివారం జరిగింది. మున్సిపల్ చైర్‌పర్సన్ రెడ్డి సత్య నాగేంద్రమణి, కౌన్సిలర్లు గొవ్వాల రాజేష్, దొమ్మేటి రాము, చిత్రపు రామకృష్ణ, కౌన్సిల్ కో ఆప్షన్ సభ్యుడు వంకాయల కాశీ, వైఎస్సార్ సీపీ జిల్లా కార్యదర్శి కముజు రమణ, పార్టీ నాయకులు దొంగ చిన్నా, రెడ్డి సత్యనారాయణ, యువజన నాయకుడు పిండి రాజా తదితరులు పాల్గొని హైందవ శంఖారావం విజయవంతానికి పిలుపునిచ్చారు. మహాసభకు రావాలని అభ్యర్థించారు. ఆర్ఎస్ఎస్, వీహెచ్‌పీ, భగరంగ్‌దళ్ ప్రతినిధుల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. స్థానిక మార్కెట్ వీధిలో రాష్ట్ర భజరంగ్ దళ్ నాయకులు శిరంగు నాయుడు, ఊటుకూరి సాంబయ్యల ఆధ్వర్యంలో హైందవ శంఖారావానికి రావాలని ఇంటింటికి వెళ్లి స్టిక్కర్లు, ఆహ్వాన పత్రాలు అందించారు.

గుర్తుకొచ్చిన మధుర జ్ఞాపకాలు



విద్యనేర్పిన గురువులతో 1982-83 బ్యాచ్ విద్యార్థులు

యానాం: చదువులు పూర్తయిన అనంతరం వివిధ ప్రాంతాల్లో విభిన్న రంగాల్లో స్థిరపడిన పూర్వ విద్యార్థులంతా 41 ఏళ్ల తర్వాత కలుసుకొని సందడి చేశారు. అలనాటి మధుర జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. స్థానిక మహాత్మా గాంధీ ప్రభుత్వ బాలుర హైస్కూల్‌లో 1982–83 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదివిన విద్యార్థులంతా ఆదివారం తాము చదువుకున్న చదువులమ్మ చెట్టు నీడకు చేరుకున్నారు. ఒకొరినొకరు ఆప్యాయంగా పలకరించుకుంటూ క్షేమ సమాచారాలను అడిగి తెలుసుకున్నారు. రోజంతా ఆటపాటలతో ఉత్సాహంగా గడిపారు. అనంతరం వారికి విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులు సలాది సాంబశివరావు, మొండి సత్యనారాయణ మాష్టార్లను ఘనంగా సత్కరించారు. మరో ఉపాధ్యాయుడు సుదర్శన్ ఆచార్యులు ఇంటికి వెళ్లి ఆయనను సత్కరించారు.

అలరించిన ఆత్మీయ సమ్మేళనం

యానాంలోని నవోదయ విద్యాలయంలో చదివి వివిధ స్థానాల్లో స్థిరపడిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం ఆనందోత్సాహాల మధ్య జరిగింది. ఈ సందర్భంగా దేశ, విదేశాల్లో స్థిరపడిన వారంతా ఒకచోటకు చేరి తాము చదువుకున్న విద్యాలయంలో గడిపిన చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ గడిపారు. ఈ సందర్భంగా జరిగిన ఆత్మీయ సమ్మేళన సమావేశానికి ముఖ్య అతిథిగా ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ రాజశేఖర్‌రెడ్డి పాల్గొని మాట్లాడారు. అనంతరం పూర్వ విద్యార్థుల సహకారంతో కొత్తగా నిర్మాణం చేసిన మినరల్ వాటర్ ప్లాంట్‌ను రాజశేఖర్‌రెడ్డి ప్రారంభించారు. అనంతరం ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు.

వెంకన్న ఆలయంలో నూతన నిర్మాణాలకు పూజలు



ఆలయ నిర్మాణ పూజల్లో మల్లాడి, ఆర్ఏఓ మునిస్వామి తదితరులు

యానాం: పట్టణంలో కొలువైన భూ సమేత వెంకటేశ్వర స్వామి(మీసాలవెంకన్న) నూతన ఆలయ నిర్మాణంలో భాగంగా ఆదివారం ఆలయ గాలిగోపురం, మండప నిర్మాణాలకు పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రతినిధి మల్లాడి కృష్ణారావు ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు జరిగాయి. ఈ సందర్భంగా ఆలయ అర్చకుల వేద మంత్రోచ్ఛారణల మధ్య జరిగిన పూజల్లో ఆలయ నిర్మాణ కమిటీ ప్రతినిధులు, పలువురు భక్తులు పాల్గొన్నారు. ఇప్పటివరకు ఆలయ నిర్మాణానికి దాతలు, టీటీడీ దేవస్థానం, భక్తుల సహకారంతో రూ.7 కోట్ల వరకు ఖర్చు పెట్టినట్లు మల్లాడి కృష్ణారావు తెలిపారు. సెప్టెంబర్ 16న అధికారులతో మాట్లాడి రెండో దశ నిర్మాణానికి రూ.3 కోట్లు కావాలని కోరినట్లు తెలిపారు. మొత్తం మీద రెండో దశకు రూ.7 నుంచి రూ.8 కోట్లు ఖర్చు అవుతున్నట్లు అంచనా వేశామన్నారు. కార్యక్రమంలో ఆర్ఏఓ మునిస్వామి, దేవస్థానం మాజీ అధ్యక్షుడు కాపగంటి ఉమాశంకర్, వేగేశ్న భాస్కరరాజు, ఇన్‌చార్జి మున్సిపల్ కమిషనర్ రామకృష్ణ, సాయికుమార్ పాల్గొన్నారు.

పుస్తకాల కొనుగోళ్లకు దరఖాస్తుల ఆహ్వానం

యానాం: పుదుచ్చేరి,యానాం, మాహే, కారైకల్ తదితర ప్రాంతాలకు చెందిన రచయితలు రాసిన పుస్తకాల కొనుగోలుకు ఆదివారం కళలు, సాంస్కృతిక శాఖ ఆదేశాలు జారీ చేసింది. అన్ని గ్రంథాలయాలు స్థానిక రచయితలు రాసిన పుస్తకాలను కొనుగోలు చేసేలా వారి నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. రచయితల పుస్తకాలు 2023–24 మధ్య కాలంలో రాసినవై ఉండాలని తెలిపింది. కనీసం 30 శాతం మేర డిస్కౌంట్ ఇవ్వాలని నమూనా పుస్తకాన్ని దరఖాస్తుతో పాటు పంపాలన్నారు. రచయితలు పుదుచ్చేరి పరిధిలో జన్మించి కనీసం 5 ఏళ్లపాటు స్థానికంగా నివసిస్తూ ఉండాలన్నారు. దరఖాస్తులను డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఆర్ట్ అండ్ కల్చర్, పుదుచ్చేరి వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకుని ఈ నెల 31లోగా పంపాలని కోరారు.

సీఐ ప్రశాంత్ కుమార్‌ను కలిసిన దళిత నాయకులు

అమలాపురం రూరల్: ఉద్యోగ ధర్మమే పరమావధిగా భావించే వ్యక్తి రూరల్ సీఐ ప్రశాంత్ కుమార్ అని దళిత సంఘాల నాయకులు అన్నారు. అమలాపురం రూరల్ సీఐగా ఉద్యోగ బాధ్యతలు స్వీకరించిన ప్రశాంత్ కుమార్‌ను అల్లవరం ఎస్సై హరీష్‌కుమార్‌తో సహా కేవీపీఎస్ జిల్లా కన్వీనర్ శెట్టిబత్తుల తులసి దుర్గారావు, దేవగుప్తం సర్పంచ్ సాధనాల వెంకట్రావు, న్యాయవాది యాలంగి సత్యనారాయణ, బీఎస్పీ నాయకులు జిత్తుక సత్యనారాయణ, మండల దళిత నాయకులు మంగం నాగభూషణం, కాశి బాలయోగి, యువ నాయకులు వడ్డి సత్యనారాయణ తదితరులు ఆదివారం మర్యాద పూర్వకంగా కలిశారు.

అల్లవరం: అమలాపురం రూరల్ సీఐగా బాధ్యతలు స్వీకరించి తొలిసారిగా అల్లవరం పోలీస్ స్టేషన్‌కు వచ్చిన సీఐ ప్రశాంత్ కుమార్‌ను దళిత నాయకులు ఆదివారం మర్యాద పూర్వకంగా కలిశారు. సీఐ ప్రశాంత్ కుమార్‌కు కుల వివక్ష వ్యతిరేక పోరాట సమితి జిల్లా కన్వీనర్ తులసీరావు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో కేవీపీఎస్ నాయకులు పాల్గొన్నారు.

అమిత్‌షా వ్యాఖ్యలు బాధాకరం

యానాం: రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్‌పై కేంద్ర హోంమంత్రి అమిత్‌షా చేసిన అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా ఆదివారం నియోజకవర్గ పరిధిలో వివిధ నాయకుల ఆధ్వర్యంలో పాత బస్టాండ్ అంబేడ్కర్ సర్కిల్ వద్ద ఆందోళన నిర్వహించారు. అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అంబేడ్కర్‌పై వ్యంగ్యంగా పార్లమెంట్‌లో వ్యాఖ్యలు చేసిన అమిత్‌షాను తక్షణం పదవి నుంచి బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. మాజీ మున్సిపల్ చైర్మన్ గిడ్ల చంద్రరావు, మాజీ వైస్ చైర్మన్ పెండెం సూర్యప్రకాష్, రిటైర్డ్ సీఐ శివగణేష్, బడుగు బలరాం తదితరులు పాల్గొన్నారు.

సముద్ర స్నానానికి దిగి విద్యార్థి గల్లంతు

యానాం: పుదుచ్చేరిలోని తిరుచి ప్రాంతంలో ఓ ప్రైవేట్ ఇంజినీరింగ్ కళాశాలలో చదువుతున్న ఏపీ విద్యార్థి పుదుచ్చేరి బీచ్‌లో సముద్రస్నానానికి దిగి గల్లంతైనట్లు ఆదివారం పెరియాక్కడై పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు నమోదయ్యింది. పోలీసుల వివరాల మేరకు ఏపీలో కడప జిల్లా వెల్లుత్తూరు ప్రాంతానికి చెందిన వినీత్‌రెడ్డి(18) బీటెక్ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. క్రిస్మస్ సెలవులు ఇవ్వడంతో వినీత్‌రెడ్డితో పాటు అతడి నలుగురు స్నేహితులు బీచ్‌రోడ్డులో సెక్రటేరియట్ ఎదురుగా ఉన్న ప్రాంతంలో సముద్రస్నానానికి దిగారు. ఈ నేపథ్యంలో అకస్మాత్తుగా పెద్ద కెరటం రావడంతో వినీత్‌రెడ్డి గల్లంతయ్యాడు. మిగిలినవారు సురక్షితంగా ఒడ్డుకు చేరారు. పోలీసులు సమాచారం అందుకుని కోస్టుగార్డు, అగ్నిమాపక దళాలతో వినీత్‌రెడ్డి ఆచూకీ కోసం గాలించారు. కుటుంబ సభ్యులకు సమాచారం అందించినట్లు తెలిపారు. అన్ని కోస్టల్ పోలీస్ స్టేషన్లకు గల్లంతైన ఘటన గూర్చి సమాచారం అందించినట్లు పోలీసులు తెలిపారు.

రక్తదాన బృంద ప్రతినిధి రాముకు సత్కారం

అమలాపురం టౌన్: అమలాపురం సహస్ర బ్లడ్ బ్యాంక్ తొలి వార్షికోత్సవం సందర్భంగా స్థానిక కిమ్స్ ఆస్పత్రి సమీపంలో గల బ్లడ్ బ్యాంక్ కార్యాలయంలో బ్లడ్ సర్వీస్ టీం వ్యవస్థాపకుడు మూదే రాముకు ఆదివారం సత్కారం జరిగింది. సహస్ర బ్లడ్ బ్యాంక్ ఇన్‌చార్జి శ్రీహరి మాట్లాడుతూ బ్లడ్ సర్వీస్ టీంను రాము నిర్వహిస్తూ ఆపదలో ఉన్న వారికి రక్తదానం చేసి ఆదుకుంటున్నారని పేర్కొన్నారు. తనకు జరిగిన సత్కారం టీం ద్వారా రక్తదానం చేసిన వారిందరికీ వర్తిస్తుందని రాము పేర్కొన్నారు.